www.hamsakalam.com

PRGI TGTEL/26/A3129

# హంస కలం వార్త

సంచలన తెలుగు దినపత్రిక

HAMSAKALAM VARTHA

ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి

మేడ్చల్ మల్కాజిగిరి | సెప్టెంబర్ 17 గురువారం 2026 | సంపుటి : 1 | సంచిక : 118 | పేజీలు : 8 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : వడ్ల మధుసూదన్ చారి

MEDCHAL ,MALKAJGIRI | THURSDAY AUGUST 17 2026 | VOL:1 | ISSUE: 118 | PAGES:8 | Rs. 4:00 | EDITOR:VADLA. Madhusudan chary






**తెలంగాణలో సెమికండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సింగపూర్ బృందం**

**రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని ముఖ్యమంత్రి**

**సెమికండక్టర్ పరిశ్రమకు పూర్తి స్థాయిలో సహకారాన్ని అందిస్తామని హామీ**

భవిష్యత్తు ప్రపంచ సాంకేతిక రంగాన్ని, కృత్రిమ మేధస్సు విప్లవాన్ని శాసించబోతున్న సెమీకండక్టర్ రంగానికి తెలంగాణ ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తోంది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే వ్యూహంలో భాగంగా, రాష్ట్రంలో సెమీకండక్టర్ పరికరాలు, చిప్ డిజైనింగ్, తయారీ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ బృహత్తర ప్రణాళికలో భాగంగా, తెలంగాణలో సెమీకండక్టర్ల పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సింగపూర్ బృందం ప్రకటించింది. శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ శాశ్వత కార్యదర్శి (ఇంధన, వాణిజ్య విభాగం) అగస్టిన్ లీ నేతృత్వంలోని బృందం భేటీ అయి విస్తృతంగా చర్చలు జరిపింది. రాష్ట్రంలో అత్యాధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అనుమతులు, సబ్సిడీలు, సహకారాన్ని అందిస్తామని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక రంగంలోనే కాకుండా అంతర్జాతీయ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తున్నామని స్పష్టం చేశారు. నెట్-జీరో కార్బన్ విధానంతో నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ, తొలిదశ మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, నైట్ ఎకానమీ ప్రణాళికలను సింగపూర్ బృందానికి వివరించారు. ఇప్పటికే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు తమ ఆఫ్-షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా అంగీకరించాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాబోయే డిసెంబరు నెలలో ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' కు సింగపూర్ బృందాన్ని సీఎం అధికారికంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

## భారత్‌పై 100 శాతం సుంకాలు?.. రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా కీలక బిల్లు!

- రష్యా చమురు కొనుగోలుదారులే లక్ష్యంగా అమెరికా బిల్లు
- భారత్ నుంచి దిగుమతులపై 100 శాతం సుంకాలు విధించే అవకాశం
- ప్రతినిధుల సభలో కీలక అడ్డంకిని దాటిన బిల్లు.. నేడు తుది ఓటింగ్
- సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చే అధికారం అధ్యక్షుడికి
- భారత్‌తో పాటు చైనా, హంగేరి వంటి దేశాలపైనా ప్రభావం

రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు అమెరికా సిద్ధమవుతోంది. రష్యా నుంచి అధిక మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్న భారత్ వంటి దేశాలపై ఏకంగా 100 శాతం వరకు దిగుమతి సుంకాలు (టారిఫ్‌లు) విధించడానికి వీలు కల్పించే కీలక బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో మార్గం సుగమమైంది. 'లిండ్సే గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు సంబంధించిన కీలక తీర్మానం మంగళవారం స్వల్ప మెజారిటీతో ఆమోదం పొందింది.

(మిగతా 2వ పేజీలో..)



## భారత్‌తో న్యూజిలాండ్ భారీ డీల్.. 95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గింపు!

- న్యూజిలాండ్ పార్లమెంట్‌లో ఎఫ్‌టీఏ బిల్లుకు ఆమోదం
- 57 శాతం ఎగుమతులకు వెంటనే సుంకం మినహాయింపు
- పూర్తిస్థాయిలో 95 శాతం ఎగుమతులకు సుంకాల తగ్గింపు
- కివీ పరిశ్రమకు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్ల వరకు ఆదా
- ఈ ఏడాది చివర్లో అమల్లోకి ఎఫ్‌టీఏ

భారత్-న్యూజిలాండ్ మధ్య వాణిజ్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది.

(మిగతా 2వ పేజీలో..)



## అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

- ఒక్క గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని సవాల్
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఎదురుదాడి
- ముఖ్యమంత్రిపై తమకు నమ్మకం లేదని వ్యాఖ్య

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన భూ ఆరోపణలపై తెలంగాణ

(మిగతా 2వ పేజీలో..)



## 'మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?'.. పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు

- అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై ప్రశ్నలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్‌ఓసీ ఆరోపణ
- గంగుల కమలాకర్ భూములపైనా మంత్రి వ్యాఖ్యలు
- 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములని వెల్లడి
- 47,440 ఎకరాలు తగ్గించినట్లు ప్రభుత్వం వెల్లడి

మాజీ మంత్రి హరీశ్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు హరీశ్‌రావు మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్

(మిగతా 2వ పేజీలో..)



## లండన్ 'ది షార్డ్' వద్ద సీఎం విజయ్ ఈవెంట్ రద్దు... తీవ్ర నిరాశలో అభిమానులు

- లండన్ లో ఉన్న విజయ్ ని చూసేందుకు వేచిచూసిన వందలాది మంది అభిమానులు
- భద్రతా కారణాలతో కార్యక్రమాన్ని రద్దు చేసిన లండన్ మెట్రోపాలిటన్ పోలీసులు
- ఈరోజు భారత్ కు తిరిగి రానున్న విజయ్

(మిగతా 2వ పేజీలో..)



హంస కలం వార్త

# అంతా అబద్ధం.. రేవంత్ రెడ్డి ఆరోపణలకు కవిత కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ సేన అధినేత్రి కవిత తీవ్రంగా స్పందించారు. తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తుల కంటే ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్లు నిరూపించినా, ఆ భూమిని ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె సవాల్ విసిరారు. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేశారని, ఆయన మాటలపై తమకు విశ్వాసం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం తనపైనే కాకుండా, అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన ‘గుంటనక్క’తో పాటు కేసీఆర్ ఫాంహౌస్‌లోని సీఎం గూఢచారి, నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులందరి భూములపై సమగ్ర విచారణ జరిపించాలని కవిత డిమాండ్ చేశారు. ‘గుంపు మేస్త్రీ – గుంటనక్క’ ముమ్మాటికీ కలిసే ఉన్నారని ఈ సందర్భంగా కవిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కానీ, ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించిన దానికంటే గజం భూమి అదనంగా ఉన్నా ప్రభుత్వానికే అప్పగిస్తానని ఆమె పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలు, కవిత సవాల్‌తో రాష్ట్ర రాజకీయాల్లో భూముల వివాదం మరింత వేడెక్కింది.

## ‘మరి హరీశ్‌రావు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?’.. పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

ఎలా జరిగిందని ప్రశ్నించారు. “అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది?” అని హరీశ్‌రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి.. తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌ఓసీ ఇచ్చిందన్న హరీశ్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అన్నారు. ఆ విషయం హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌ఓసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనని అన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో సుమారు నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

## భారత్‌తో న్యూజిలాండ్ భారీ డీల్.. 95 శాతం ఎగుమతులపై సుంకాల తగ్గింపు!

(మొదటి పేజీ తరువాయి)

ఇరు దేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) అమలుకు అవసరమైన బిల్లును న్యూజిలాండ్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు అనుకూలంగా 93 మంది ఎంపీలు ఓటేయగా.. 29 మంది వ్యతిరేకించారు. ఒప్పందం అమల్లోకి వచ్చిన వెంటనే న్యూజిలాండ్ నుంచి భారత్‌కు వెళ్లే ఎగుమతుల్లో 57 శాతానికి సుంకం ఉండదు. పూర్తిస్థాయిలో అమలు జరిగితే 95 శాతం ఎగుమతులపై సుంకాలు పూర్తిగా తొలగిపోవడం లేదా భారీగా తగ్గడం జరుగుతుంది. దీంతో భారత మార్కెట్‌లో న్యూజిలాండ్ ఉత్పత్తులకు మరింత అవకాశం దక్కనుంది. కివీ పండ్ల పరిశ్రమకు ఈ ఒప్పందం భారీ ఊరటనివ్వనుంది. వచ్చే ఐదేళ్లలో సుంకాల రూపంలో సుమారు 125 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు ఆదా అవుతాయని అంచనా. సరిహద్దుల్లో సరకుల తనిఖీ, క్లియరెన్స్ ప్రక్రియ కూడా వేగవంతం కానుంది. భారత్‌లో పెరుగుతున్న మధ్యతరగతి.. న్యూజిలాండ్ ఎగుమతిదారులకు పెద్ద మార్కెట్‌గా మారుతోందని ఆ దేశ వాణిజ్య, పెట్టుబడుల మంత్రి టాడ్ మెక్లే చెప్పారు. ఆహారం, టెక్నాలజీ, విద్య, పర్యాటకం, ప్రొఫెషనల్ సర్వీసెస్‌కు భారత్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను న్యూజిలాండ్ కంపెనీలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

ఇరు దేశాల ఆమోద ప్రక్రియలు పూర్తయిన తర్వాత ఎఫ్‌టీఏ అమల్లోకి వస్తుంది. ఈ ఏడాది చివర్లోనే ఒప్పందం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని మెక్లే చెప్పారు. 2030 నాటికి భారత్–న్యూజిలాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. వెస్ట్‌పాక్ ఇన్‌స్టిట్యూషనల్ బ్యాంక్ ఇటీవల ఇచ్చిన నివేదికలోనూ భారత్ వృద్ధి అవకాశాలను ప్రస్తావించింది. ఎఫ్‌టీఏ వల్ల వచ్చే పదేళ్లలో న్యూజిలాండ్ జీడీపీకి దాదాపు 0.1 శాతం అదనపు వృద్ధి రావచ్చని అంచనా వేసింది.

## లంబోదరుడి లీల.. భాగ్యనగరంలో రూ.10 వేల కోట్ల వ్యాపారంగా మారిన వేడుక

వినాయక చవితి వచ్చిందంటే చాలు, భాగ్యనగరం భక్తి పారవశ్యంలో మునిగిపోతుంది. గల్లీ గల్లీలో కొలువుదీరే గణనాథుడికి చేసే సేవలో ఎలాంటి లోటూ ఉండదు. అయితే, ఈ భక్తి సంబరం వెనుక నగర ఆర్థిక వ్యవస్థకు జవసత్వాలు అందించే ఓ పెద్ద వాణిజ్య కోణం కూడా ఉంది. గణపతి ఉత్సవాలు కేవలం ఆధ్యాత్మిక ఆనందాన్ని మాత్రమే కాదు, లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ వేల కోట్ల రూపాయల వ్యాపారానికి వేదికగా నిలుస్తున్నాయి.

ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు

వివాహాలు, శుభకార్యాలు లేని శూన్యమాసంలో వెలవెలబోయిన ఎన్నో వ్యాపారాలకు గణేశ్ నవరాత్రులు కొత్త ఊపిరినిస్తాయి. ముఖ్యంగా టెంట్ హౌస్‌లు, లైటింగ్, డీజే సౌండ్ సిస్టమ్స్, బ్యాండ్ మేళాలు, క్యాటరింగ్ సర్వీసుల వారికి ఈ పది రోజులు చేతినిండా పని దొరుకుతుంది. భాగ్యనగర గణేశ్ ఉత్సవ సమితి అంచనాల ప్రకారం, ఈ ఉత్సవాల సందర్భంగా నగరంలో దాదాపు రూ.6,000 కోట్ల వ్యాపారం జరుగుతుంది. అయితే అనధికారిక లెక్కల ప్రకారం ఇది రూ.10,000 కోట్లు దాటుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దేశంలో మహారాష్ట్ర తర్వాత అంతటి వైభవంగా గణేశ్ ఉత్సవాలు జరిగేది హైదరాబాద్‌లోనే.



లక్షలాది మందికి ఉపాధి

ఈ ఉత్సవాలు ప్రత్యక్షంగా సుమారు రెండు లక్షల మందికి, పరోక్షంగా మరో నాలుగు లక్షల మందికి ఉపాధిని అందిస్తున్నాయని అంచనా. విగ్రహాలు తయారు చేసే కళాకారులు, పందిళ్ల అలంకరణ చేసేవారు, పూలు, పండ్లు అమ్మేవారు, పురోహితులు, తీన్‌మార్ కళాకారులు, నిమజ్జనం కోసం ట్రక్కులు, లారీలు నడిపేవారు.. ఇలా ఎన్నో రంగాల వారు ఈ పండుగపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్క విగ్రహాల విక్రయాలే రూ.100 కోట్లకు పైగా ఉండగా, మండపాల అలంకరణకు మరో రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నారంటే ఉత్సవాల ఆర్థిక స్థాయిని అర్థం చేసుకోవచ్చు. భక్తులు భక్తితో ఖర్చు చేసే ప్రతి రూపాయి, నగర ఆర్థిక వ్యవస్థలో తిరుగుతూ ఎందరికో జీవనోపాధిని అందిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అందుకే గణేశ్ ఉత్సవం కేవలం భక్తి సంబరమే కాదు, నగర ఆర్థిక వ్యవస్థలో ప్రతి ఒక్కరినీ భాగస్వామిని చేసే ఒక పెద్ద ఉపాధి యజ్ఞం.

# భారత్‌పై 100 శాతం సుంకాలు?.. రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా కీలక బిల్లు!

ప్రతినిధుల సభలో ఈ తీర్మానానికి అనుకూలంగా 214 ఓట్లు, వ్యతిరేకంగా 211 ఓట్లు వచ్చాయి. ఇద్దరు డెమొక్రాట్లు రిపబ్లికన్లతో కలిసి ఓటు వేయడంతో బిల్లు తుది ఓటింగ్‌కు సిద్ధమైంది. బుధవారం ఈ బిల్లుపై తుది ఓటింగ్ జరగనుంది. ఇప్పటికే ఈ బిల్లును అమెరికా సెనేట్ 86–11 ఓట్ల భారీ ఆధిక్యంతో ఆమోదించింది. దీంతో ప్రతినిధుల సభలో కూడా ఆమోదం పొందితే, ఇది చట్టంగా మారనుంది. ఈ చట్టం అమల్లోకి వస్తే, రష్యా నుంచి అత్యధికంగా చమురు లేదా సహజవాయువును దిగుమతి చేసుకుంటున్న ఐదు దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభిస్తుంది. ఈ బిల్లులో ఎక్కడా భారత్ పేరును ప్రత్యక్షంగా ప్రస్తావించలేదు. అయితే, ప్రస్తుతం రష్యా నుంచి అధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చాక కూడా భారత్ టాప్–5 కొనుగోలుదారుల జాబితాలో కొనసాగితే, ఈ సుంకాల నిబంధన పరిధిలోకి వచ్చే ప్రమాదం ఉంది. భారత్‌తో పాటు చైనా, అజర్‌బైజాన్, హంగేరి, స్లోవేకియా వంటి దేశాలు కూడా ఈ కేటగిరీలో ఉన్నాయి. అయితే, ఈ సుంకాల నుంచి దేశాలకు మినహాయింపు ఇచ్చే అధికారాన్ని కూడా ఈ బిల్లు అధ్యక్షుడికి కల్పిస్తోంది. ఉక్రెయిన్‌పై యుద్ధానికి నిధులు సమకూర్చుకుంటున్న రష్యా ఇంధన ఆదాయాన్ని దెబ్బతీయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని దీని సమర్థకులు చెబుతున్నారు. మరోవైపు, అధ్యక్షుడికి ఇంత విస్తృతమైన టారిఫ్ అధికారాలు ఇవ్వడంపై కొందరు డెమొక్రాట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లు రష్యా నాయకత్వం, ఇంధన రంగం, చమురు రవాణాకు వాడే ‘షాడో ఫ్లీట్’ నౌకలపై అదనపు ఆంక్షలు విధించడంతో పాటు ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను కూడా పొడిగించనుంది. గురువారం తర్వాత ప్రతినిధుల సభ సమావేశాలు విరామంలోకి వెళ్లనున్న నేపథ్యంలో ఈ బిల్లు భవితవ్యం నేడు తేలిపోనుంది.

# లండన్ ‘ది షార్డ్’ వద్ద సీఎం విజయ్ ఈవెంట్ రద్దు... తీవ్ర నిరాశలో అభిమానులు

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ని చూసేందుకు లండన్‌లోని అత్యంత ఎత్తైన భవనం ‘ది షార్డ్’ వద్ద నిన్న వందలాది మంది అభిమానులు భారీగా గుమిగూడారు. అయితే, అత్యధిక జనసందోహం కారణంగా భద్రతా సమస్యలు తలెత్తే అవకాశం ఉందని లండన్ మెట్రోపాలిటన్ పోలీసులు హెచ్చరించడంతో ఆ కార్యక్రమాన్ని నిర్వాహకులు రద్దు చేశారు. గంటల తరబడి వరుసల్లో వేచి ఉన్న అభిమానులకు ఈ నిర్ణయం తీవ్ర నిరాశను మిగిల్చింది. “శాంతిభద్రతలు, ప్రజా భద్రత దృష్ట్యా ముందస్తు అనుమతి లభించకపోవడంతో ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నాం” అని ముఖ్యమంత్రి బృందానికి చెందిన ప్రతినిధి మైక్‌లో ప్రకటించారు. “తమిళనాడులో చూసే జనసందోహంతో పోలిస్తే ఇది చాలా తక్కువే అయినప్పటికీ, భద్రత పరంగా పోలీసుల నిర్ణయం సహేతుకమైనదే. కానీ గంటల తరబడి హోటల్ బయట వేచి ఉన్న అభిమానులకు నిరాశ తప్పలేదు” అని ఒక యువ అభిమాని పేర్కొన్నారు. మరోవైపు, తమిళనాడును ఆసియాలోనే అధునాతన తయారీ, సాంకేతిక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా విజయ్ నేతృత్వంలోని బృందం బ్రిటన్ పర్యటన చేపట్టింది. ఈ పర్యటనలో భాగంగా రూ. 12,300 కోట్ల విలువైన ఒప్పందాలపై సంతకాలు జరిగినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 9,400 కంటే ఎక్కువ ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభించనున్నాయనే అంచనాలు ఉన్నాయి. తన యూకే పర్యటనను ముగించుకుని విజయ్ ఈరోజు భారత్‌కు చేరుకోనున్నారు.

# తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఆ ఇద్దరూ మళ్లీ అధికారంలోకి తెస్తారు: శ్రీధర్ బాబు

**రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ మధ్య పూర్తి సమన్వయం ఉందన్న శ్రీధర్ బాబు**

**రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలో కాంగ్రెస్ మళ్లీ గెలుస్తుందని వ్యాఖ్య**

**అసెంబ్లీని సుదీర్ఘంగా నిర్వహించడం బీఆర్ఎస్ నేతలకు నచ్చదని విమర్శ**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ల మధ్య అత్యుత్తమ పరిపాలనా, రాజకీయ సమన్వయం ఉందనడంలో ఎలాంటి సందేహం లేదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్, పార్టీ నిర్మాణం ఒకే దిశలో పయనిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో వీరిద్దరి నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో తిరిగి ఘన విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో చర్చించాలనే తాము భావించామని... అయితే సభకు ముఖం చాటేసే వ్యూహంతోనే కావాలని గందరగోళం సృష్టించి వారు సభ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు శాసనసభ ప్రజాస్వామ్య నియమావళి, సభ నిర్వహణ అస్సలు నచ్చవని విమర్శించారు. తమ పదేళ్ల పాలనలో అసెంబ్లీని అతి తక్కువ రోజులు నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వం పారదర్శకంగా సుదీర్ఘంగా సభను నిర్వహిస్తుంటే తట్టుకోలేక పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ, విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలిచేందుకు బీఆర్ఎస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను బలిచేస్తోందని శ్రీధర్ బాబు దుయ్యబట్టారు.

## జిన్‌పింగ్‌కు బ్రెయిన్ స్ట్రోక్.. ఆసుపత్రిలో చికిత్స! సోషల్ మీడియాలో కలకలం

**బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్‌కు స్ట్రోక్ అంటూ ప్రచారం**

**సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన చైనా విపక్ష నేత**

**షెడ్యూల్ ప్రకారమే అన్ని కార్యక్రమాల్లో పాల్గొన్న జిన్‌పింగ్**

**వదంతులను ధ్రువీకరించని చైనా, భారత వర్గాలు**

**ఆరోగ్య సమస్యలను కొట్టిపారేస్తున్న అధికారిక రికార్డులు**

న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆరోగ్యంపై సోషల్ మీడియాలో తీవ్రమైన ప్రచారం జరుగుతోంది. సదస్సు మధ్యలో ఆయన సొమ్మసిల్లి పడిపోయారని, ఆ తర్వాత తీవ్రమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారని వదంతులు వ్యాపించాయి. అయితే, ఈ ఆరోపణలకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. చైనాలో ప్రవాస జీవితం గడుపుతున్న విపక్ష నేత వాన్‌జున్ క్వీ ఈ ప్రచారానికి తెరలేపడంతో ఇది అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. తన సోషల్ మీడియా పోస్టులో వాన్‌జున్ క్వీ పలు ఆరోపణలు చేశారు. సదస్సులో అస్వస్థతకు గురైన జిన్‌పింగ్‌కు ఆయన వ్యక్తిగత వైద్య బృందం అత్యవసర చికిత్స అందించిందని, భారత్‌లోని ఆసుపత్రిలో చేరితే విషయం బయటకు పొక్కుతుందని భయపడి పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని ప్రత్యేక విమానంలో చైనాకు తిరిగి వెళ్లారని పేర్కొన్నారు. బీజింగ్‌లో దిగిన వెంటనే ఆయనను హెలికాప్టర్‌లో నేరుగా మిలిటరీ ఆసుపత్రికి తరలించారని, అక్కడ ఇస్కీమిక్ స్ట్రోక్‌కు శస్త్రచికిత్స జరిగిందని, ప్రస్తుతం ఆయన ఐసీయూలో ఉన్నారని క్వీ ఆరోపించారు. అయితే, ఈ ప్రచారానికి, అధికారిక రికార్డులకు ఏమాత్రం పొంతన లేదు. చైనా విదేశాంగ శాఖ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జిన్‌పింగ్ సదస్సులో పాల్గొన్నారు. సెప్టెంబర్ 12న న్యూఢిల్లీకి చేరుకుని, తొలి సెషన్‌లో ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 13న రెండో సెషన్‌లోనూ పాల్గొని, మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరారు. భారత ఉన్నతాధికారులు ఆయనకు విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. సెప్టెంబర్ 12న ప్రధాని మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ గైర్హాజరైనప్పటికీ, సుదీర్ఘ ప్రయాణం, వరుస సమావేశాల కారణంగా ఆయన విశ్రాంతి తీసుకున్నారని, ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి వాంగ్ యీ హాజరయ్యారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే, సదస్సులో మోదీ ప్రసంగిస్తూ మధ్యలో ఆగి జిన్‌పింగ్ వైపు చూసి ‘అంతా ఓకేనా?’ అని అడగటం కూడా చర్చనీయాంశమైంది. అయితే అది ట్రాన్స్‌లేషన్ హెడ్‌ఫోన్లలో సాంకేతిక సమస్య వల్లే జరిగిందని, ఆరోగ్య సమస్య కాదని నివేదికలు చెబుతున్నాయి. సదస్సు ముగిసిన తర్వాత కూడా జిన్‌పింగ్‌కు సంబంధించిన అధికారిక కార్యక్రమాలపై చైనా ప్రభుత్వ మీడియా కథనాలు ప్రచురిస్తూనే ఉంది. ఈ వదంతులు కేవలం ఒక రాజకీయ ప్రత్యర్థి నుంచి వచ్చినవేనని, వీటికి ఎలాంటి ఆధారాలు లేవని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ఎక్స్’ సైతం ‘కమ్యూనిటీ నోట్స్’ జతచేసింది. ఇప్పటివరకు, జిన్‌పింగ్ ఆరోగ్యానికి సంబంధించి వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలేనని, అధికారిక దౌత్య రికార్డులతో అవి సరిపోలడం లేదని స్పష్టమవుతోంది.



# మద్నూర్ రైల్వే స్టేషన్ కోసం అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

- సామాన్యుడి విజ్ఞప్తికి స్పందించిన రైల్వే శాఖ.. మద్నూర్‌కు చేరుకున్న కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అఖిల్
- మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల రాకపోకలకు రైల్వే సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి

**మద్నూర్, సెప్టెంబర్ 16**

నిజామాబాద్ జిల్లా మద్నూర్ మండలానికి రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలన్న స్థానికుడి విజ్ఞప్తిపై రైల్వే శాఖ స్పందించింది. మద్నూర్ మండలం తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు సమీపంలో ఉండటంతో ప్రజల రాకపోకలకు రైల్వే సౌకర్యం ఎంతో అవసరమని పేర్కొంటూ మద్నూర్ మండలానికి చెందిన బండివార్ హన్మండ్లు గత కొన్ని రోజుల క్రితం దక్షిణ మధ్య రైల్వే నాందేడ్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌కు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా విజ్ఞప్తి చేశారు.మద్నూర్ మండలంలో అనేక గ్రామాలు ఉన్నాయని, సమీపంలో రైల్వే స్టేషన్ లేకపోవడంతో విద్యార్థులు, రైతులు, రోగులు, కార్మికులతో పాటు సాధారణ ప్రజలు రాకపోకల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తన విజ్ఞప్తిలో పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు, మహారాష్ట్ర నుంచి తెలంగాణ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు రైల్వే సౌకర్యం అందుబాటులో ఉంటే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.మద్నూర్‌లో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల్లో ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైల్వే స్టేషన్ ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల సర్వే నిర్వహించి, భవిష్యత్ రైల్వే ప్రతిపాదనల్లో మద్నూర్‌ను చేర్చాలని కోరారు.

అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

ఈ విజ్ఞప్తిపై స్పందించిన రైల్వే శాఖ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అఖిల్ బుధవారం మద్నూర్ మండల కేంద్రానికి చేరుకున్నారు. మద్నూర్ గ్రామంలో గ్రామపంచాయతీ




సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు.ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ అవసరాన్ని తెలియజేసిన బండివార్ హన్మండ్లును గ్రామపంచాయతీ కార్యాలయానికి పిలిపించి, మద్నూర్ మండల ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులు, రైల్వే సౌకర్యం అవసరం, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలతో ఉన్న రాకపోకల పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.బండివార్ హన్మండ్లు మాట్లాడుతూ.. తెలంగాణ--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల మధ్య నిత్యం ప్రజల రాకపోకలు కొనసాగుతున్నాయని, రైల్వే స్టేషన్ లేకపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మద్నూర్ మండల ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.సామాన్య వ్యక్తి చేసిన విజ్ఞప్తిపై రైల్వే శాఖ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మద్నూర్ రైల్వే స్టేషన్ ప్రతిపాదనపై సాధ్యాసాధ్యాలను పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## భూకొనపల్లి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.50 లక్షలు

**కామారెడ్డి: సెప్టెంబర్ 16**

కామారెడ్డి పట్టణంలోని 6వ వార్డులో ఉన్న భూకొనపల్లి ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి, కామారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ (సీతక్క), రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీ షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్. జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ తోట లక్ష్మీకాంత్ రావు కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మంజూరైన నిధులతో ఆలయ అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారుఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, డీసీసీ అధ్యక్షులు మల్లికార్జున్, డీసీసీ మాజీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సందీప్, మండల అధ్యక్షులు రాజగౌడ్, కృష్ణారావు, సొసైటీ చైర్మన్లు గూడెం శ్రీనివాస్, ఇంద్రకరణ్ రెడ్డి, భీంరెడ్డి, సుధాకర్, స్థానిక కౌన్సిలర్ గంగాధర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, కౌన్సిలర్లు అంజాద్, మజీద్, వాజీద్, జావీద్, సత్యం, చిట్టీబాబు, మహేష్, లడ్డు, కో-ఆప్షన్ మెంబర్ అలీ, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పుట్నాల



శ్రీను, మండల అధ్యక్షులు రమేష్ గౌడ్, సీనియర్ నాయకులు పండ్ల రాజు, సర్పంచ్ రేఖ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, అశోక్ రెడ్డి, గంప ప్రసాద్, తిరుమల స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, లక్ష్మి, సుతారి రమేష్, యాదవరెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ మహిళా సమాఖ్య జిల్లా సదస్సును విజయవంతం చేయాలి

**ఈ నెల 19న నిజామాబాద్‌లో జిల్లా సదస్సు.. పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావాలి: గుమ్మటు పద్మ మాదిగ**

**కోటగిరి/, సెప్టెంబర్ 16/**

ఈ నెల 19న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సందీప్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న మాదిగ మహిళా సమాఖ్య, మహాజన మహిళా మండలి జిల్లా సదస్సును విజయవంతం చేయాలని మాదిగ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుమ్మటు పద్మ మాదిగ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న లింగ వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా మహిళలను చైతన్యపరిచేందుకు, ఉద్యమంలో భాగస్వాములను చేసేందుకు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మహిళలను నూతన ఉద్యమానికి సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లా మహిళా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సదస్సు అనంతరం మాదిగ మహిళా సమాఖ్య, మహాజన మహిళా మండలి నూతన జిల్లా కమిటీలను ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు.కుల, మతాలకు అతీతంగా మహాజన మహిళలు, జిల్లాలోని మాదిగ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆమె కోరారు. మహిళల హక్కులు, సామాజిక సమానత్వం, వివక్షకు వ్యతిరేకంగా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

మహిళలను ఉద్యమానికి సిద్ధం చేస్తాం

మహిళల సమస్యలపై చర్చించడంతో పాటు, భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు జిల్లా సదస్సు వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. సదస్సులో మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు.ఈ కార్యక్రమంలో మాదిగ మహిళా సమాఖ్య జాతీయ పొలిట్‌బ్యూరో నాయకురాళ్లు సత్తక్క, పెద్దొల్ల యమున మాదిగ, కన్నూరు సుధ మాదిగ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మటు పద్మ మాదిగ, పోచిరాం, కోటగిరి, పోతంగల్ మండల అధ్యక్షులు పోశెట్టి, అశోక్, గ్రామ అధ్యక్షులు లాలయ్య, కన్నం శ్రీనివాస్, ఎడ్ల సాయిలు, కృష్ణ, దినేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## వినాయక చవితి వేళ పోతంగల్‌లో వెలుగులు

**ప్రతి గల్లీలో వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి.. రాత్రివేళ సిబ్బందితో కలిసి పర్యవేక్షించిన బజరంగ్**

**పోతంగల్,/ సెప్టెంబర్ 16/**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పోతంగల్ మండల కేంద్రంలోని పాత గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద, ప్రతి గల్లీలో వీధి దీపాలు వెలిగేలా గ్రామ పంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన బల్బులు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని సర్పంచ్ కల్లూరి సంధ్య భర్త బజరంగ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, కరెంట్ హెల్పర్ హైమద్‌తో కలిసి రాత్రివేళ స్వయంగా పరిశీలించారు.ప్రతి వీధిలో తిరుగుతూ ఎక్కడైనా వీధి దీపాలు వెలగకపోతే వెంటనే గుర్తించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. పండుగ సమయంలో ప్రజలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాత్రివేళల్లోనూ పర్యవేక్షణ చేపట్టడంపై గ్రామస్తులు బజరంగ్‌ను అభినందించారు.



ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే అవసరం!!!!

ఇప్పటివరకు ఎంతోమంది సర్పంచులు వచ్చి వెళ్లారని, అయితే ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, అవసరమైన సమయంలో అందుబాటులో ఉండే వ్యక్తులు అరుదుగా ఉంటారని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకుని, పండుగ సమయాల్లో సైతం గ్రామంలో పర్యటిస్తూ ఏర్పాట్లను పరిశీలించడం అభినందనీయమని అన్నారు.ఎన్నికల సమయంలో డబ్బులు పంచే నాయకులను గెలిపించుకుంటే, ఎన్నికల తర్వాత సామాన్య ప్రజలే వారి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు అభిప్రాయపడ్డారు. డబ్బు, ఆర్భాటం కాకుండా నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన, ప్రజల మధ్య ఉంటూ ఐదేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రజలు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి సేవ చేస్తా!

ఈ సందర్భంగా సర్పంచ్ కల్లూరి సంధ్య భర్త బజరంగ్ మాట్లాడుతూ.. "ప్రజలు ఇచ్చిన తీర్పును ప్రశ్నించే గొంతుగా కాకుండా, ప్రజల గొంతును వినిపించే వ్యక్తిగా ఉండాలని కోరుకుంటున్నాను. ప్రజలు నాపై ఉంచిన నమ్మకంతో గెలిపించారు. నేను ప్రజా సేవకుడిని. గ్రామంలో ఏ ప్రజా సమస్య వచ్చినా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రానివ్వకుండా నా వంతు కృషి చేస్తాను. నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతాను. ప్రజల కోసం పనిచేయడమే నా బాధ్యత" అని పేర్కొన్నారు. పదవిని అధికారంగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావిస్తూ, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని బజరంగ్ స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో, కల్లూరి బజరంగ్, బురబోయిన, గంగాధర్, కొంతల్ శంకర్, శేట్టి నాని ట్రాక్టర్ డ్రైవర్, తదితరులు. పాల్గొన్నారు

## రక్తదానం చేసి మానవత్వం చాటిన సేవకులు

**ఆపదలో ఉన్న వృద్ధురాలికి అండగా నిలిచిన రమేష్.. ఇద్దరు రక్తదాతల ద్వారా రక్తం అందజేత**

**కోటగిరి, సెప్టెంబర్ 16**



కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రుక్మిణి గౌడ్ గారికి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని బసవతారకం ఆసుపత్రిలో ఆపరేషన్ నిమిత్తం బీ పాజిటివ్ రక్తం అవసరమైంది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు సేవకుడు సీతల రమేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి రక్తదాతలను సమకూర్చారు.రమేష్ సర్ చొరవతో బీర్కూర్ మండలం చించోలి గ్రామానికి చెందిన వెంకటేష్ శర్మ, పోతంగల్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన రాకేష్ పటేల్ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఆపద సమయంలో స్పందించి రక్తం అందించడంతో రుక్మిణి గౌడ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.అత్యవసర సమయంలో రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రక్తదాతలుగా ముందుకు వచ్చిన వెంకటేష్ శర్మ, రాకేష్ పటేల్‌తో పాటు రక్తదాతలను సమకూర్చిన సేవకుడు సీతల రమేష్‌కు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



రక్తదాతలు:

వెంకటేష్ శర్మ -- చించోలి, బీర్కూర్ మండలం

రాకేష్ పటేల్ -- హంగర్గ, పోతంగల్ మండలం

సేవకుడు: సీతల రమేష్

కృతజ్ఞతలతో

సాయాగౌడ్, కొత్తపల్లి (కోటగిరి) ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు యూనిఫాం మరియు షూస్ పంపిణీ కార్యక్రమం

**కారేపల్లి ప్రతినిధి:**

అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వీరా అప్పాయిగూడెం పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం మరియు షూస్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీ దండు ప్రవీణ్ గారు, ప్రధాన అధ్యాపకురాలు సత్యవతి గారు, కార్యదర్శి కృష్ణవేణి గారు, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి గారు, బిఎఫ్‌టి వసంత్ గారు, గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు విద్య యొక్క ఆవశ్యకత, ప్రాధాన్యతను తెలియజేస్తూ, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించడం జరిగింది."విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది" ? సందేశంతో కార్యక్రమం కొనసాగింది.



హంస కలం వార్త

# చలో భద్రాచలం ఐటీడీఏ ఆదివాసీ మార్చ్ సెప్టెంబర్ 21 జయప్రదం చేయండి

**తుడుందెబ్బ పోలీట్ బ్యూరో సభ్యులు వాసం ముసలయ్య**

**తుడుందెబ్బ ఆధ్వర్యంలో పోస్టర్ కరపత్రం విడుదల**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, సెప్టెంబర్ 16**



చర్ల లో తుడుందెబ్బ ఆఫీస్ ఆవరణంలో ఆదివాసీ ఉద్యమ వీరుడు కోమరం భీమ్ విగ్రహం ముందు చర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం చేతుల మీదుగా చలో ఐటీడీఏ భద్రాచలం పోస్టర్,కరపత్రం విడుదల చేసారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు వాసం ముసలయ్య మాట్లాడుతూ, తెలంగాణ వచ్చిన తర్వాత ఆదివాసీల బ్రతుకులను ఆగం చేసారని ఆరోపించారు. అలాగే ఐటీడీఏ లను నిర్వీర్యం చేసి మా ఉద్యోగాలను మైదాన ప్రాంతాలకు దోసిపెడుతున్నారని దుయ్యబట్టేరు. అలాగే తాజా నోటిఫికేషన్ ఐన పోలీస్ రిక్రుమెంట్ లో కూడ ఆదివాసీ నిరుద్యోగ యువతను ప్రభుత్వం మోసం చేస్తున్నదని అలాగే మాకు చెందల్సిన వాటా,జీవో 109 ప్రకారం మాకు ఇవ్వాలని అన్నారు. అలాగే 1960 వడ్డీ వ్యాపార నిషేధ చట్టం ఉన్న ఏజెన్సీ లో వలస గిరిజనేతరులు వడ్డీ వ్యాపారాలు చేసి ఆదివాసీ బ్రతుకులు ఆగం చేస్తున్న, అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. అలాగే ఈ ఐటీడీఏ మార్చ్ కి ఆదివాసీ ప్రజలు. ఆదివాసీ యువకులు. ఆదివాసీ నిరుద్యోగులు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వల్లి శ్రీకాంత్,తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి రామకృష్ణ, తుడుందెబ్బ మండల అధ్యక్షులు పూనెం రవికిరణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కలం శ్రీనివాస్, కోశాధికారి సోడి రవీంద్ర, ఉపాధ్యక్షులు తుర్రం ఆదినారాయణ, సహాయ కార్యదర్శి తాటి శ్రీను, ఆర్గనైజేషన్ సెక్రటరీ మడప అనిల్ కుమార్,సోడి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బూట్లు, సాక్సుల పంపిణీ

- **సులేమాన్ నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో 70 మంది విద్యార్థులకు పంపిణీ**

**సులేమాన్ నగర్/, సెప్టెంబర్ 16**



మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల సులేమాన్ నగర్‌లో విద్యార్థులకు బూట్లు, సాక్సుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 70 మంది విద్యార్థులకు బూట్లు, సాక్సులు అందజేశారు.విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల అవసరాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు కార్యక్రమంలో పాల్గొన్న వారు తెలిపారు.70 మంది విద్యార్థులకు బూట్లు, సాక్సులు అందజేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

## నాయి బ్రాహ్మణ ఆవిర్భావ దినోత్సవం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, సెప్టెంబర్ 16**



చర్లలో నిర్వహించిన నాయి బ్రాహ్మణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చా రామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన సమస్యలపై ఆయన మాట్లాడారు. మచ్చా రామారావు మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణులు తరతరాలుగా క్షౌర వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి వృత్తి అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, రుణాలు, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అదేవిధంగా సాంప్రదాయ వృత్తిపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా సంబంధిత ప్రభుత్వ నిబంధనలు, వృత్తి అర్హతలు, లైసెన్సింగ్, సంక్షేమ విధానాలను సమర్థంగా అమలు చేయాలని ఆయన కోరారు. సెలూన్ వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి అవకాశాలు ఉండేలా, అదే సమయంలో నాయి బ్రాహ్మణుల సాంప్రదాయ వృత్తి హక్కులు, జీవనోపాధికి రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణ సమాజం ఐక్యతతో తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని, వృత్తి అభివృద్ధితో పాటు యువతకు ఆధునిక శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని మచ్చా రామారావు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు, నాయకులు మాధవరావు, రమణ, గోరింట్ల వెంకన్న, శ్రీను, ఐనవోలు శ్రీను, ముక్కాల ప్రసాద్, తోటపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## బాలల గణేష్ బడా గణేష్ బాలల గణేష్ వద్ద అన్నదానం కార్యక్రమం నిర్ణయించారు

**రుద్రూర్: సెప్టెంబర్16**



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రం జవహర్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి 9.. బాలల వినాయకుడు వద్ద అన్నదాన కార్యక్రమం చేశారు.. రాబోయే రోజులలో బాలల గణేష్ బడా గణేష్ చేస్తామని బాలలు వివరించారు.. జై వినాయక జై జై వినాయక అంటూ ముందుకు కొనసాగుతున్న జవహర్ నగర్ కాలనీ.. బాలల గణేష్ మండలి ఆ యొక్క వినాయకుడి దీవెనాతులతో ముందుకు కొనసాగిస్తామని.. ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా పూజలు అందిస్తూ జవహర్ నగర్ కాలనీ.. బాలలు వివరించారు ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాలనీ నివాసులు ఈ బాలల కు తోడుగా ఉంటూ ముందుకు కొనసాగిస్తామని భాస్కర్ తెలిపారు.



# సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మనోభావాలను గౌరవించాలి

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు**

**పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,భద్రాచలం, సెప్టెంబర్16**




కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అవుతూ, గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి నాంది పలుకుతున్నాయని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. చర్ల మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సీనియర్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని సమయంలో సైతం పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి, పార్టీ మనుగడ కోసం పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించకూడదని అన్నారు.సీనియర్ నాయకులు సీనియర్ నాయకులు బండారు రామకృష్ణ , ఆవుల విజయ భాస్కర్ రెడ్డి పటేల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. వారి త్యాగాలు, సేవలు, కష్టాన్ని గుర్తించి పార్టీ వారికి తగిన గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు మాట్లాడుతూ,పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు లేదా ఇతర బాధ్యతలు వచ్చినప్పుడు ముందుగా పార్టీ కోసం దీర్ఘకాలంగా పనిచేసిన సీనియర్ నాయకులకు అవకాశం కల్పించిన అనంతరం మాత్రమే నూతనంగా పార్టీలోకి వచ్చిన వారికి అవకాశాలు కల్పించాలని వారు అధిష్టానాన్ని కోరారు. భద్రాచలం నియోజకవర్గంలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవుల విషయంలో పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారి మనోభావాలు దెబ్బతినడం పార్టీ భవిష్యత్తుకు మంచిది కాదని ఇర్ప శ్రీనివాసరావు అన్నారు.గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. వారి కష్టంతోనే నేడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని అన్నారు.కష్టకాలంలో పార్టీ కోసం నిలబడిన కార్యకర్తలు, నాయకులు నేడు తలదించుకునే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని, పార్టీ అధిష్టానం వెంటనే ఈ అంశంపై దృష్టి సారించి సీనియర్ నాయకుల మనోభావాలను గౌరవించాలని కోరారు.దురదృష్టవశాత్తు కొంతమంది నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీ భవిష్యత్తుకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని, ఇటువంటి పరిణామాలు పార్టీని నమ్ముకుని పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలకు తీవ్ర మనోవేదన కలిగిస్తున్నాయని, సమావేశానికి హాజరైన పలువురు నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న ప్రతి సీనియర్ నాయకుడు, కార్యకర్తకు సముచిత గౌరవం, గుర్తింపు లభించేలా అధిష్టానం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.పార్టీని అధికారంలోకి తెచ్చింది మేము.. ఇప్పుడు మమ్మల్ని పట్టించుకునేదెవరు?, చర్ల మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిని. ఈరోజు నా మనోవేదనను, నాలాంటి ఎంతో మంది చర్ల మండల సీనియర్ కార్యకర్తల ఆవేదనను మీ ముందు ఉంచుతున్నాను.2023 అసెంబ్లీ ఎన్నికల్లో చర్ల మండలంలో కాంగ్రెస్ జెండా ఎగరేయడానికి మేము పడిన కష్టం మాకే తెలుసు. బీఆర్ఎస్ బెదిరింపులకు భయపడకుండా, పగలు-రాత్రి తేడా లేకుండా, సొంత డబ్బులు పెట్టుకుని, నా భార్యతో సహా ఇంటింటికీ తిరిగి ఓట్లు అడిగాను. పార్టీకి అధికారం లేని కష్టకాలంలో కూడా పార్టీ కి అండగా కొనసాగుతూ పార్టీని కాపాడుకున్నాము .కానీ బాధాకరమైన విషయం ఏమిటంటే, పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీనియర్ పదవి నుంచి కూడా తీసివేయడం జరిగింది. కొన్ని సంవత్సరాలుగా అధికారం లేకపోయినా నమ్మకంగా పనిచేసిన నాకు ఇదేనా దక్కిన గౌరవం.నేను పార్టీ కోసం ఇంత చేసినా, సీనియర్ నాయకులు లకు కనీసం ఇందిరమ్మ ఇల్లు గానీ, ఏ ఒక్క సంక్షేమ పథకం గానీ నా కుటుంబానికి అందలేదు. నేను ఒక్కడినే కాదు, చర్ల మండలంలో నాలాంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎంతో మంది ఉన్నారు. పార్టీ కోసం జీవితాన్ని అంకితం చేసిన వారికి కనీస గుర్తింపు కూడా లేకుండా పోయింది.చర్ల మండలంలో మా పరిస్థితి ఇది: ఎన్నికల్లో గెలిచిన తర్వాత పదవులు ఎవరికి వస్తున్నాయి. కార్యక్రమాల్లో ఫోటోలకు ఫోజులిచ్చే వారికి, హైదరాబాద్, కొత్తగూడెం చుట్టూ తిరిగే వారికి తప్ప, చర్ల మండలంలో గ్రామగ్రామాన పార్టీని బతికించిన మాకు కనీస గుర్తింపు కూడా లేదు.“జెండా మోసింది మేము - ఫలితం అనుభవిస్తున్నది ఎవరు?”

ఇది నా ఒక్కడి ప్రశ్న కాదు, చర్ల మండలంలోని ప్రతి సీనియర్ నాయకుడి ప్రశ్న. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా మోసింది మేము. అధికారం వచ్చాక మమ్మల్ని పక్కన పెట్టడం ఎంతవరకు న్యాయం.మా డిమాండ్:భద్రాచలం నియోజకవర్గ డీసీసీ నాయకత్వం, ఎమ్మెల్యే చర్ల మండలంలో నిజంగా పార్టీ కోసం పనిచేసిన సీనియర్ నాయకులు, కార్యకర్తలను గుర్తించాలి. నామినేటెడ్ పదవులు నియమించడంతో పాటు, అర్హులైన మా కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాల్లో తగిన న్యాయం చేయాలి. కార్యకర్త బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది. చర్ల మండల కార్యకర్త బాగుంటేనే భద్రాచలంలో మళ్లీ కాంగ్రెస్ జెండా ఎగురుతుంది.

# గిరిజనుల రిజర్వేషన్లు 10 శాతానికి పెంచింది కేసీఆరే.

**తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే.**

**సెప్టెంబర్ 17న ప్రతి తండాలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలి.**

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి.**

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 16**

గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు.గిరిజనుల హక్కుల పరిరక్షణలో కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గుర్తుచేస్తూ సెప్టెంబర్ 17న మెదక్ జిల్లాలో ప్రతి తండాలో కేసీఆర్‌కు క్షీరాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచేందుకు కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. గిరిజనుల స్వయం పాలన కోసం తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత కూడా కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు.గిరిజనుల విద్యా, సామాజిక అభివృద్ధి కోసం గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారని గుర్తుచేశారు.గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. 10 శాతం రిజర్వేషన్ కారణంగా గిరిజన విద్యార్థులకు విద్యా రంగంలో ప్రయోజనం కలుగుతోందని, వైద్య విద్యలో ఏటా విద్యార్థులకు సీట్లు లభిస్తున్నాయని తెలిపారు. గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం కేసీఆర్ చేసిన కృషిని గుర్తుచేసుకునేందుకే సెప్టెంబర్ 17న ప్రతి తండాలో క్షీరాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనులకే సర్పంచులుగా అవకాశం కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. తండాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. తండాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, 24 గంటల విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. రోడ్లు లేని పలు తండాలకు రహదారులు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించారని పేర్కొన్నారు.మెదక్ పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి ఒక ఎకరం స్థలం కేటాయించామని గుర్తు చేశారు. నిధులు కూడా మంజూరు చేసినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని ఆరోపించారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నది కూడా కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. కేసీఆర్ హయాంలో తండాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని, మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ,ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఇది ప్రజా పాలన కాదని, కాంగ్రెస్ నాయకుల పాలనగా మారిందని ఆరోపించారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గిరిజనుల హక్కులు, సంక్షేమాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. గిరిజనుల అభివృద్ధికి కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించడం లేదని ఆరోపించారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.అనంతరరం సుల్తాన్‌పూర్ తండా సర్పంచ్ రమేష్, గిరిజన నాయకులు శ్రీను నాయక్, రంజిత్ నాయక్, ధన్ సింగ్ లు మాట్లాడుతూ.. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వయం పాలన కల్పించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందనిఅన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచి వారి హక్కులకు గుర్తింపు కల్పించారని తెలిపారు.కేసీఆర్ హయాంలో తండాలకు పంచాయతీ హోదా కల్పించడంతో పాటు రోడ్లు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన తండాల్లో సమస్యలు మళ్లీ మొదలయ్యాయని ఆరోపించారు.మెదక్ పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి ఒక ఎకరం స్థలం కేటాయించి, నిధులు మంజూరు చేసినప్పటికీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు రద్దు చేసిందని ఆరోపించారు.గిరిజనుల సంక్షేమం, అభివృద్ధిని ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. తండాలకు గతంలో కల్పించిన మౌలిక వసతులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న మెదక్ జిల్లాలోని అన్ని తండాల్లో బిఆర్ఎస్ జెండాలు ఎగురవేసి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్,జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,మెదక్ హవెలిఘనపూర్ మండల పార్టీ అధ్యక్షులు యం అంజ గౌడ్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా. నరేందర్, నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్,ప్రభు రెడ్డి,ఆర్కే శ్రీనివాస్,సాప సాయిలు, మార్గం.ఆంజనేయులు,శ్రీహరి, ప్రభాకర్,మంగ్యా,ఫుల్ సింగ్, ధన్ సింగ్,పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



హంస కలం వార్త



# ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు





**కోరుట్ల, సెప్టెంబర్ 16**

పంట మార్పిడిలో భాగంగా రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి సూచించారు. బుధవారం కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలోని రైతువేదికలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ మండలంలో గతంలో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసిన రైతులకు ప్రస్తుతం దిగుబడులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం గెలలను కొనుగోలు చేసి, రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం భారీగా సబ్సిడీలు అందిస్తోందన్నారు. ఒక మొక్క ధర రూ.193 కాగా, రైతు వాటాగా కేవలం రూ.20 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. డ్రిప్ సౌకర్యానికి కూడా సబ్సిడీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న రైతులు వ్యవసాయ లేదా ఉద్యాన విస్తరణ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, ఆత్మ బీఎఫ్ఏసీ సభ్యుడు, ఏఈఓ అనిల్, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ భరత్, రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమం ఉద్ధృతం చేద్దాం





**సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్**

**కోరుట్ల, సెప్టెంబర్ ,16**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ సాయుధ పోరాట దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కోరుట్లలో ముగింపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొని ప్రసంగించారు. ముందుగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన కరీంనగర్ తొలి పార్లమెంట్ సభ్యుడు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్దూం మొహియుద్దీన్‌తో పాటు పోరాటంలో అమరులైన దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, సోయాబుల్లాఖాన్, ధర్మభిక్షం తదితర నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల త్యాగాల ఫలితంగానే నేటి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. వీర తెలంగాణ సాయుధ పోరాట వారసత్వం కమ్యూనిస్టులదేనని పేర్కొన్నారు. చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తే సహించేది లేదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో కోరుట్ల ప్రాంతంలో సీపీఐ ఆధ్వర్యంలో సీ. ప్రభాకర్, కడకుంట్ల గంగారం, మహబూబ్ అలీ, చింతకింది నరసన్న, గూడూరి గంగారం, మార్గం రాజలింగన్న తదితరుల ఆధ్వర్యంలో భూ పోరాటాలు నిర్వహించి పేదలకు ఇళ్ల స్థలాలు సాధించి పెట్టిన ఘనత సీపీఐకి ఉందన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. బీడీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, గ్రామపంచాయతీ కార్మికుల హక్కులు, సంక్షేమం, ప్రభుత్వ పథకాల కోసం సమ్మెలు, దీక్షలు నిర్వహించి అనేక హక్కులను సాధించిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ తుల రాజేందర్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు సుతారి రాములు, జిల్లా అధ్యక్షులు గణేష్, ఉపాధ్యక్షులు ములుగూరి హనుమంతు, ఎం.డి. ఉస్మాన్, కిరణ్ శ్రీ, గాదె దేవదాస్, ఏ.ఎన్నం రాధా, రామిల్ల రాంబాబు, తిప్పర్తి రమేష్, ఎం.డి. సమీర్, అందే వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కూరగాయల సాగుతో అధిక దిగుబడి.. ఉద్యాన శాఖ రాయితీలతో రైతులకు అదనపు ఆదాయం

**సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూరగాయల సాగుకు రైతులు ముందుకు రావాలి:**

**జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్**

**పెద్దపల్లి (సెప్టెంబర్ 16)**

పెద్దపల్లి మండలంలోని వివిధ కూరగాయల సాగు క్షేత్రాలను జిల్లా ఉద్యాన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ ఈరోజు సందర్శించి, కూరగాయల సాగులో ఆధునిక పద్ధతులు, అధిక దిగుబడులు, ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న వివిధ రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతు శ్రీ పూడారి చంద్రశేఖర్ సాగు చేస్తున్న గ్రాఫ్టెడ్ టమాటా, వంకాయ పంటలను పరిశీలించారు. ఈ పంటలు అధిక దిగుబడినిస్తూ పెద్దపల్లి మార్కెట్‌లో మంచి ధరలు లభించడంతో రైతుకు మంచి ఆదాయం వస్తోందని తెలిపారు. అలాగే వెదురు కర్రలను ఆధారంగా చేసుకుని సాగు చేస్తున్న కాకరకాయ పంటను పరిశీలించారు. కూరగాయల సాగులో ఆధార కర్రల ఏర్పాటుకు ఉద్యాన శాఖ ద్వారా హెక్టారుకు రూ.10,000 వరకు రాయితీ, శాశ్వత పందిళ్ల నిర్మాణానికి హెక్టారుకు రూ.1.00 లక్ష వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. మల్చింగ్ షీట్‌కు హెక్టారుకు రూ.20,000 వరకు రాయితీతో పాటు టమాటా, మిరప, వంకాయ, క్యాబేజీ, కాలీఫ్లవర్, క్యాప్సికమ్ తదితర కూరగాయల నాణ్యమైన నాట్లను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. పంటల అంతర కృషి పనుల కోసం మినీ ట్రాక్టర్లు, పవర్ స్ప్రేయర్లు వంటి వ్యవసాయ యంత్రాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయల పంటలను ప్రోత్సహించాలని సూచించారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకుంటూ కూరగాయల సాగు ద్వారా రైతులు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఉద్యాన శాఖ అందిస్తున్న వివిధ రాయితీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీ పూడారి చంద్రశేఖర్, శ్రీ రమేష్, శ్రీ శ్రీనివాస్, ఉద్యాన విస్తరణ అధికారులు బి. రాము, బి. మహేష్ తదితరులు పాల్గొన్నారు....



## మేడ్చల్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 10 ట్రాఫిక్ కేసుల పరిష్కారం...

### ఇద్దరికి జైలు శిక్ష - ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్

**మేడ్చల్, సెప్టెంబర్ 16,**




మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన పలు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులలో 10 కేసులకు పరిష్కారం లభించగా ఇద్దరికి కోర్టు జైలు శిక్ష ఖరారు చేసినట్లు ట్రాఫిక్ సీఐ క్రాంతి కుమార్ బుధవారం వివరించారు. సీఐ మాట్లాడుతూ మేడ్చల్ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో 10 కేసులు ప్రవేశపెట్టగా మొత్తం పరిష్కారమయ్యాయని సీఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో మొత్తం 8 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. న్యాయస్థానం ఇద్దరికి నిందితులకు జైలు శిక్ష ఖరారు చేసిందని ఇందులో ఒకరికి మూడు రోజులు, మరొకరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించనట్లు వెల్లడించారు. డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు మొత్తం రూ. 13 వేల 700 జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని కేసులు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 2 కేసులను పరిష్కరించి, నిందితులకు రూ. 2 వేలు జరిమానా విధించినట్లు వివరించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని, వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలను తుచ తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ ఎస్ హేచ్ ఓ క్రాంతి కుమార్ విజ్ఞప్తి చేశారు.

## 22ఏ భూముల సమస్య పరిష్కరించాలి

### కలెక్టరేట్ ఎదుట టీడీపీ ధర్నా.. కలెక్టర్‌కు వినతిపత్రం

**మేడ్చల్ జిల్లా, కీసర, సెప్టెంబర్ 16,**




తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మేడ్చల్--మల్కాజ్‌గిరి కలెక్టరేట్ ఎదుట టీడీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కిని నరసింహులు, అరవింద్‌కుమార్ గౌడ్, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కందికంటి అశోక్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ముఖ్య నాయకులు హాజరయ్యారు. 22ఏ చట్టం కింద నిషేధిత జాబితాలో చేర్చిన భూముల సమస్య సామాన్య ప్రజలకు శాపంగా మారిందని నాయకులు అన్నారు. ప్రభుత్వాలు, రెవెన్యూ యంత్రాంగం మారుతున్నా సమస్య పరిష్కారంలో జాప్యం కొనసాగడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హత ఉన్న భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్ గౌడ్, జిల్లా అడహక్ సభ్యుడు జంగారెడ్డి, కాంటెస్టెంట్ రామోజు శివకుమార్, జి. రాములు యాదవ్, సుంకరి వెంకటేష్ , సతీష్, రాగిరు సత్యనారాయణ గౌడ్, బింగి బిక్షపతి గౌడ్, టీ. ప్రకాష్, సురేష్ గుప్తా, రాజేష్, ఉదిస్ట్ తదితరులు పాల్గొన్నారు.

## అయిలాపూర్ మహిళపై దాడి కేసు

### సోషల్ మీడియాలో ప్రచారం అవాస్తవం

**కోరుట్ల, సెప్టెంబర్ 16**



కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో మహిళపై దాడి ఘటనకు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మెట్‌పల్లి డీఎస్పీ ఏ. రాములు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. అయిలాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ ఆగస్టు 24న ఇంటి నుంచి కనిపించకుండా పోయిందని తన భర్త తమ్ముడితో వెళ్లినట్లు ఆమె భర్త కోట దుర్గయ్య ఆగస్టు 25న కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2న వారిద్దరూ జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు మహిళ స్టేట్‌మెంట్‌ను నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారని చెప్పారు. అనంతరం కోరుట్ల పోలీసులు కూడా కౌన్సెలింగ్ ఇచ్చి వారిని వారి ఇళ్లకు పంపినట్లు తెలిపారు. తదుపరి అయిలాపూర్‌లో ఇరువర్గాల కుల పెద్దల సమక్షంలో పంచాయతీ జరగగా తాను తన మరిదితోనే ఉంటానని మహిళ చెప్పినట్లు డీఎస్పీ వివరించారు. అనంతరం ఆమె మరిది వద్దకు వెళ్లి అతనితో కలిసి ఉంటున్న సమయంలో అతని మొదటి భార్యకు సంబంధించిన బంధువులైన తల్లి, అక్క తదితరులు వారి ఇంటికి వచ్చి మహిళ ముఖంపై జీడి చల్లి దాడి చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 15న కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అయితే మహిళ మర్మాంగాలపై కూడా కారం చల్లి, ఆమెను వివస్త్రను చేశారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మహిళ ముఖంపై మాత్రమే జీడి చల్లి దాడి చేసినట్లు తేలిందన్నారు. దర్యాప్తులో వెల్లడయ్యే ఆధారాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఏ. రాములు తెలిపారు.

హంస కలం వార్త

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో గాయత్రి జూనియర్ కళాశాల విద్యార్థిని కీ గోల్డుమెడల్.







పెద్దపల్లి (సెప్టెంబర్ 16)

గతవారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం హైదరాబాద్ తెలంగాణ ఇంటర్ డిస్టిక్ కరాటే ఛాంపియన్షిప్ 2026 తెలంగాణ బి ఎస్ ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో పెద్దపెల్లి జిల్లా గాయత్రీ జూనియర్ కళాశాల ఏసిఇ గ్రూప్ చెందిన వెలుతురు నిహారిక గోల్డ్ మెడల్స్ సాధించి తన ప్రతిభ కనబరిచింది. అక్టోబర్ లో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు స్థానం సంపాదించుకుంది ఈ సందర్భంగా గాయత్రీ కళాశాల యాజమాన్యం నిహారికను అభినందిస్తూ జాతీయ స్థాయిలో గోల్డ్ సాధించాలని కళాశాలకు మరియు మన జిల్లాకు గొప్ప పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అందుకు విద్యాసంస్థ తరఫున సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు

## రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా ఖో- ఖో పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ఎంపిక

పెద్దపల్లి (సెప్టెంబర్ 16)




ఈ నెల12వ తేదీన అప్పన్నపేట జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పెద్దపెల్లి జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా సెలక్షన్ ట్రయల్స్ పోటీలలో అత్తి తమ ప్రతిభ కనబరిచి ఈనెల 16వ తేదీన హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి సూఫియాన్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తగురం తిరుపతి తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్ మరియు ప్రధానోపాధ్యాయులు హకీంఖాన్ విద్యార్థిని అభినందించారు

## ఖో ఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినా అంబరిపేట విద్యార్థిని

కథలాపూర్ సెప్టెంబర్ 16.




కథలాపూర్ మండలంలోని అంబరిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఖేలో ఇండియా క్రీడల్లో భాగంగా శనివారం కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా బాలబాలికల ఖో ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు ఇందులో భాగంగా అంబారిపేట విద్యార్థిని చింత శరణ్య అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరీంనగర్ డివైస్ ఓ శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ రిఫరీ బోర్డ్ కన్వీనర్ సూర్య ప్రకాష్ తెలిపారు, వీరు హైదరాబాదులోని సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలొ పాల్గొంటారని హెచ్ఎం కిసాన్ రావు మరియు పిడి రాజేష్ తెలిపారు వీరిని ఉపాధ్యాయ బృందం మరియు గ్రామస్తులు అభినందించారు

## ఇటిక్యాలలో పోషణ మాసం కార్యక్రమం

రాయికల్, సెప్టెంబర్ 16



రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని మూడవ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో, ప్రసవానంతరం తల్లులు సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు శిశువుల ఎదుగుదల సక్రమంగా ఉంటుందని ఇటిక్యాల సెక్టర్ సూపర్వైజర్ అనూహ్య వివరించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం, సమయానికి టీకాలు వేయించడం, రక్తహీనత నివారణకు అవసరమైన పోషకాహారాన్ని తీసుకోవడం వంటి అంశాలపై సూచనలు అందించారు. పోషణ మాసంలో భాగంగా పోషణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఐదో నెల గర్భిణీకి శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి టి. రాజేష్, వార్డు సభ్యురాలు మాలాని, ఇటిక్యాల సెక్టర్ సూపర్వైజర్ అనూహ్య, అంగన్వాడీ టీచర్ వి. సువర్ణ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, మహిళలు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 30లోగా డిజిటల్ పంటల సర్వే పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రతి రైతు సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి**

**డిజిటల్ పంటల సర్వే లేక ఏ ఒక్కరైతు కూడా సన్న రకం ధాన్యం బోనస్ కోల్పోకూడదు**

**రైతులతో సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వేను పూర్తి చేయాలి**

**డిజిటల్ పంటల సర్వేపై అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి (సెప్టెంబర్ 16)



ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో డిజిటల్ పంటల సర్వేను వేగవంతం చేసి, సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డిజిటల్ పంటల సర్వేపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న డిజిటల్ పంటల సర్వే పురోగతి, రైతుల సాగు వివరాల ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని సూచించారు. ప్రతి రైతు సాగు చేస్తున్న పంట వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా సెప్టెంబర్ 30లోగా పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అందించే బోనస్ పొందేందుకు డిజిటల్ పంటల సర్వే వివరాలు కీలకమని తెలిపారు. డిజిటల్ పంటల సర్వే పూర్తికాకపోవడం వల్ల సన్న రకం ధాన్యం సాగు చేస్తున్న ఏ ఒక్క రైతు కూడా బోనస్ కోల్పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రైతుకు సంబంధించిన పంట వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏఈఓలు, వ్యవసాయ అధికారులు రైతులతో సమన్వయం చేసుకుంటూ డిజిటల్ పంటల సర్వేను నిర్వహించాలని ఆదేశించారు. రైతుల నుంచి అవసరమైన వివరాలను సేకరించి, సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా సర్వే పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడైనా జాప్యం ఉంటే వెంటనే గుర్తించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఎంపిక చేయబడిన వాలంటీర్లను పర్యవేక్షిస్తూ,ప్రభుత్వ నిర్దేశిత గడువులోగా డిజిటల్ పంటల సర్వేను పూర్తిచేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే

పెద్దపల్లి (సెప్టెంబర్ 16)




గిరిజనులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి ఈరోజు పెద్దపల్లి మండలంలోని గోపయ్యపల్లి గ్రామంలో లంబాడి తండ లో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. తెలంగాణలో గిరిజనుల జనాభాకు అనుగుణంగా ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. గిరిజనుల విద్య, ఉద్యోగ అవకాశాలను పెంచాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్ కల్పించిందని తెలిపారు. గిరిజనులకు విద్య, ఉద్యోగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు రాజకీయంగా కూడా తగిన ప్రాధాన్యత కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని దాసరి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. గోండులు, లంబాడీలు, నాయక్‌పోడులు తదితర గిరిజన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ ద్వారా ప్రయోజనం కల్పించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గాల్లో గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించి, గిరిజనులకు రాజకీయ అవకాశాలు కల్పించే విధంగా కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. హైదరాబాద్‌లో సేవాలాల్ బంజారా భవన్, కొమురం భీం ఆదివాసీ భవన్ నిర్మాణం కూడా గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచాయని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామని దాసరి మనోహర్ రెడ్డి తెలిపారు. తండాలను గ్రామపంచాయతీలుగా మార్చిందన్నారు. తండాలకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గురుకులాలు, వసతి గృహాల ద్వారా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి, భోజన సదుపాయాలు అందించామని అన్నారు. అయితే ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇప్పటివరకు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని దాసరి మనోహర్ రెడ్డి విమర్శించారు. గిరిజన విద్యార్థులకు రూ. 25 వేల నుంచి రూ. లక్ష వరకు ప్రోత్సాహకం అందిస్తామని, ప్రైవేట్ కంపెనీల్లో ఎస్టీలకు ప్రాధాన్యత కల్పిస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించి గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. గిరిజన యువతకు విద్య, ఉద్యోగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించడంతో పాటు తండాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయాలని అన్నారు. "గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం కేవలం ఒక ప్రభుత్వ నిర్ణయం కాదు.. గిరిజన యువత భవిష్యత్తుకు ఉపయోగపడే కీలకమైన అవకాశం. ఆ రిజర్వేషన్‌ను తీసుకువచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదే" అని దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా గిరిజనులకు ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారి వెంట ఎతీం మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్కుమార్,మాజీ సర్పంచ్ సదయ్య, మాజీ ఖఎఏ చైర్మన్ శంకర్ నాయక్, ముత్యాల రాజయ్య, బాపు, చంద్ర మొగిలి, ఉప సర్పంచ్ వేల్పుల హరీష్, మల్ రెడ్డి,

## పుల్కల్ మండల కేంద్రంలో కేజీబీవీ రుతుక్రమ పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన

జోగి పేట: సెప్టెంబర్ 16:




బేటీ బచావో -- బేటీ పడావో (దీదీధూ) కార్యక్రమంలో భాగంగా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంగారెడ్డి జిల్లా ఆందోల్ అసెంబ్లీ నియోజక వర్గం పుల్కల్ మండలం పరిధిలోని కేజీబీవీలో విద్యార్థినులకు రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం మరియు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ



సందర్భంగా విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ల సరైన వినియోగం, భద్రపరిచే విధానం, వినియోగం అనంతరం పరిశుభ్రంగా పారవేసే విధానంపై అవగాహన కల్పిస్తూ 3,000 శానిటరీ ప్యాడ్లను శానిటరీ ప్యాడ్ బ్యాంకు ద్వారా పంపిణీ చేశారు. అలాగే బాలికల ప్రాముఖ్యతను తెలియజేస్తూ మొక్కలు నాటించారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త పల్లవి సీడీపీఓ మధులిక, ఎం ఈ ఓ శంకర్, ఎస్ ఓ ఇంద్రజ, మెడికల్ ఆఫీసర్ శ్వేత, పంచాయతీ సెక్రటరీ, ఐ సి టి ఎస్ సూపర్‌వైజర్లు, జెండర్ స్పెషలిస్ట్, ఆశా వర్కర్, విద్యార్థినులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

హంస కలం వార్త

# సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు

సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (ఎస్పీఎఫ్) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (ఎస్పీఎఫ్) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం.తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి.ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి.  ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

# ఒత్తిడిని తగ్గించుకోవాలంటే ఏం చేయాలో తెలుసా?

ఈ రోజుల్లో ఉద్యోగ రీత్యా లేదా ప్రేమ, డబ్బు లేదా ఫ్యామిలీ పరంగా ఏదయినా కారణం చేత చాలామంది టెన్షన్ లేదా ఒత్తిడికి గురవుతారు. దీని వలన మన మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది. ప్రతి చిన్న దానికి ఎక్కువగా ఆలోచించడం వలన కూడా టెన్షన్, ఒత్తిడి వంటివి పెరుగుతాయి. మనం ఇతరులతో ఎలా మాట్లాడాలి వారు మనకు ఎలా స్పందిస్తారో ముందుగా ఊహించుకొని మనం అనుకున్న అంచానాలు రీచ్ అవ్వకపోయినా ఒత్తిడికి గురవుతారు. కాబట్టి మనం ప్రతి విషయంలో ఎలా జరిగిన దానిని స్వీకరించగలగాలి అంతేగాని దాని గురించి ఆలోచిస్తూ ఉండకూడదు. మన మూడ్ సరిగ్గా లేకపోయిన ఆ సమయంలో మనం తీసుకునే నిర్ణయాలు చెడుగా ఉంటాయి. దీని వలన మనం అవతలివారిలో నెగిటివిటీ ని పెంచిన వారమవుతాము. తరువాత మనం వారు మన గురించి ఏమి ఆలోచిస్తున్నారో అని అనుకుంటూ ఉంటాము ఇలా ఆలోచనలతో ఒత్తిడికి గురవుతాము. కాబట్టి మన మూడ్ బాగోలేనప్పుడు ఎటువంటి నిర్ణయాలు తీసుకోకపోవడమే మంచిది. లావుగా ఉన్నామని లేదా సన్నగా ఉన్నామని లేదా ఏదయినా మానసిక, శారీరక సమస్య వచ్చినా కొందరు చాలా బాధపడుతుంటారు. అంతే కానీ సమస్యకు పరిష్కారం వెతకరు. కాబట్టి మనం ఏదయినా సమస్య వచ్చినప్పుడు బాధపడకుండా దానికి పరిష్కారం వెతకాలి. ఈ మధ్య చాలామంది దానిలోనే సినిమాలు, సీరియళ్లు, షోస్ చూస్తున్నారు కాబట్టి దీని వలన మనం ఎక్కువ సమయం స్క్రీన్ మీద గడుపుతున్నారు. దీని వలన మెంటల్ హెల్త్ ఇష్యూస్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి మనం  లో సినిమాలు, సిరీస్ లు చూసేటప్పుడు మధ్యమధ్యలో బ్రేక్ ఇస్తూ ఉండాలి దాని వలన మన ఆరోగ్యానికి మంచిది. ఒత్తిడి వలన మనకు గుండె సమస్యలు, ఆస్తమా, హైపర్ టెన్షన్, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఒత్తిడిని, టెన్షన్ ను తగ్గించుకోవడానికి మనం మొదట ఎక్కువగా ఆలోచించడం తగ్గించు కోవాలి. ఇంకా యోగా, ధ్యానం వంటివి చేస్తూ ఉండాలి. వీటి వలన రిలీఫ్ గా ఉంటుంది.



## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



Edited, Printed,Published and Owned by **V. Madhusudan chary** , Lake view krishna residency.Flat no 102.Road no 4 Jaya nagarNear Ganesh Mandapam Kukatpally Telangana 500072, Printed at NALIVELLI  EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, **PRGI TGTEL/26/A3129** Cell.No 9966555449